క్లుప్తంగా

సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీని గెలిపిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్ సోదరి సురేఖ

కూర్మన్నపాలెం: సంక్షేమం, అభివృద్ధి కొనసాగింపునకు వైఎస్సార్‌సీపీనే మళ్లీ గెలిపించుకోవాలని మంత్రి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ సోదరి సురేఖ కోరారు. 87వ వార్డు కళింగవీధి సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉచిత విద్య, వైద్యం, సచివాలయ వ్యవస్థ ద్వారా పేదల గడప వద్దకే సంక్షేమ పథకాలు రావాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. ఎమ్మెల్యేగా అమర్‌నాథ్‌ను, విశాఖ ఎంపీగా బొత్సా ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు రమణ, వియ్యపు నానీ, దేవర చిన్నారావు, కోమటి రమాదేవి, కాండ్రేగుల అప్పలనాయుడు, కాండ్రేగుల రమణ, బొడ్డేటి మోదీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్‌కు ఎస్సీ, ఎస్టీల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న మార్టుపూడి పరదేశి

పెదగంట్యాడ: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లవేళలా తమ మద్దతు ఉంటుందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి తెలిపారు. ఎస్సీ నాయకులతో పెదగంట్యాడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీకి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో గంట్యాడ గురుమూర్తి, గంట్యాడ గోవిందరాజు, కాకినాడ పెంటారావు, వెంకటేష్, వెంకటరమణ, డాక్టర్ ఎస్.రాజారావు, దేవుడమ్మ, టేకేటి శ్రీను, కనకరాజు, వంగలపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త మృతి



రెడ్డిపల్లి చిట్టిబాబు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రెడ్డిపల్లి చిట్టిబాబు (55) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందారు. పార్టీ సీనియర్ కార్యకర్తగా, గుడివాడ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా చిట్టిబాబుకు గ్రామంలో మంచి గుర్తింపు ఉంది. చిట్టిబాబు మరణ వార్త తెలిసిన వెంటనే మంత్రి అమర్‌నాథ్ మిందిలో ఆయన నివాసానికి చేరుకుని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిట్టిబాబు మృతదేహం వద్ద నివాళులర్పించిన మంత్రి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, వైఎస్సార్‌సీపీ గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్ రెడ్డి, వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, జీలకర్ర నాగేంద్రతో పాటు పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు.

21, 22 తేదీల్లో సిద్ధ ఆయుర్వేద వైద్య శిబిరం

మద్దిలపాలెం : సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నామని ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ప్రతినిధి డి.సుబ్రహ్మణ్యం వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని విశాలాక్షినగర్‌లోని బీవీకే జూనియర్ కళాశాల వద్ద ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మోకాళ్ల నొప్పులు, వెన్నెముక నొప్పి, మెడ నొప్పి, భుజాల నొప్పి, కీళ్ల నొప్పులు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన వైద్యుడు జైశ్రీరామ్ చికిత్స చేయనున్నారన్నారు.

సమన్వయంతో విజయం సాధిద్దాం



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

- భారీ ర్యాలీతో 24న నామినేషన్
- మరో 20 రోజులు కష్టపడి పని చేయండి
- మీకు అండగా నేను ఉంటా..
- కార్యకర్తల సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్ విజ్ఞప్తి

అక్కిరెడ్డిపాలెం : ఈ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు మరో 20 రోజులపాటు కష్టపడి పని చేస్తే విజయం వైఎస్సార్‌సీపీ సొంతమవుతుందని ఆ పార్టీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అంతవరకు అందరూ సమన్వయంతో కలిసి పని చేయాలని కోరారు. చట్టివానిపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ గెలుపు చారిత్రాత్మక అవసరమన్నారు. ఈ ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డి గెలిస్తే 30 ఏళ్లపాటు ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు. రాష్ట్రంలో పార్టీతో పాటు గాజువాకలో తాను కూడా గెలిస్తే పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలోని కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేస్తుండటం శుభ పరిణామమన్నారు. నాయకులందరూ సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని కోరారు. తాను ప్రచారం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్న పరిస్థితులను చూస్తే గాజువాకలో పార్టీ విజయం ఖాయమని స్పష్టమవుతోందన్నారు. ఈ విషయాన్ని అందరూ దృష్టిలో పెట్టుకుని పని చేయాలన్నారు. పార్టీ కోసం, తన విజయం కోసం కష్టపడి పని చేసేవారిని గుర్తిస్తానని అమర్‌నాథ్ తెలిపారు. ఎన్నికల్లో ఎవరు కష్టపడ్డారు, ఎవరు కష్టపడలేదు అనే విషయం బూత్ స్థాయిలో వచ్చే ఓట్లను బట్టి స్పష్టమవుతుందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి నాయకులు పని చేయాలన్నారు. వార్డు ఇన్‌చార్జిలు, వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

చంద్రబాబు ప్రకటనలు హాస్యాస్పదం

రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందన్నది వాస్తవమని, ఇందులో ఎవరికీ ఎటువంటి సందేహాలు అవసరం లేదని అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కాదని ప్రజలు వేరే పార్టీలకు ఓటు వేసేందుకు సిద్ధంగా లేరన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ఇస్తున్న పథకాల కన్నా తాను ఎక్కువ ఇస్తానని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి పథకాలను చంద్రబాబు ఇవ్వడం దేనికని, మళ్లీ జగన్ మోహన్‌రెడ్డికే ఓటు వేస్తే పథకాలన్నీ సక్రమంగా వస్తాయని జనం ఇప్పటికే నిర్ణయించుకున్నారన్నారు.

మెజార్టీపైనే చర్చ

గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ వస్తేనే సంక్షేమ పథకాలన్నీ కొనసాగి పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. నాయకులు సమన్వయలోపం లేకుండా పార్టీ కోసం కష్టపడాలని కోరారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నుంచి పథకాలను తీసుకుంటున్న వారంతా సైలెంట్ ఓటింగ్‌కు సిద్ధంగా ఉన్నారన్నారు. గాజువాకలో పార్టీ గెలుపు దాదాపు ఖరారైందని, అమర్‌నాథ్ నామినేషన్ కార్యక్రమంతో పాటు ముఖ్యమంత్రి సభ తరువాత మెజార్టీ ఎంత వస్తుందన్న విషయంపై చర్చ జరుగుతుందని అన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రతిరోజు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులు బూత్ స్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి పార్టీకి ఓటు వేసే విధంగా ప్రచారం చేయాలని, నాయకుల చుట్టూ, పార్టీ పెద్దల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, ఇమ్రాన్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, వార్డు అధ్యక్షులు, వార్డు ఇన్‌చార్జులు, నాయకులు దొడ్డి రమణ, సిరట్ల శ్రీనివాస్ (వాసు), మొల్లి చిన్న, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ ర్యాలీ ఇలా..

గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను ఈనెల 24న సమర్పించనున్న నామినేషన్ సందర్భంగా చేపట్టనున్న ర్యాలీపై గుడివాడ అమర్‌నాథ్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు పార్టీ కార్యకర్తలు, నాయకులు కొత్తగాజువాక సెంటర్‌కు హాజరు కావాలని కోరారు. 68, 69వ వార్డులకు చెందిన కార్యకర్తలు, నాయకులు జింక్ గేటు వద్దకు రావాలని, పెదగంట్యాడ ప్రాంతానికి చెందినవారు బీసీ రోడ్‌లోని మసీదు వద్దకు రావాలని, అగనంపూడి, కూర్మన్నపాలెం, వడ్లపూడి తదితర ప్రాంతాలకు చెందినవారు కొత్తగాజువాక జంక్షన్‌వద్ద సమావేశం కావాలని సూచించారు. అక్కడ్నుంచి భారీ ర్యాలీగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి 12.30 గంటలకు నామినేషన్‌ను దాఖలు చేస్తామని తెలిపారు.

నామినేషన్ సందర్భంగా గతంలో ఎన్నడూ, ఎక్కడా జరగని విధంగా ర్యాలీ ఉండాలన్నారు. ఈ ర్యాలీ తన విజయానికి తొలిమెట్టు కావాలన్నారు. నామినేషన్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

ఫ్యాన్ ప్రభంజనం తథ్యం

- పార్టీపై ప్రజల్లో రెట్టింపవుతున్న విశ్వాసం
- కూటమి పార్టీలతో ఒరిగిందేమీ లేదు
- మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్
- 70వ వార్డులో విస్తృతంగా ప్రచారం



చిన్నారిని ఎత్తుకున్న అమర్‌నాథ్



తనకు ఓటు వేయాలని వృద్ధుడిని కోరుతున్న అమర్‌నాథ్

గాజువాక : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో వైఎస్సార్‌సీపీపై విశ్వాసాన్ని రెట్టింపు చేశాయని రాష్ట్ర మంత్రి, ఆ పార్టీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమన్నారు. 70వ వార్డు డ్రైవర్స్ కాలనీ, ఎర్రగెడ్డ కాలనీ, డ్రైవర్స్ కాలనీలలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఐదేళ్లలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, విద్య.. వైద్య రంగాల్లో వచ్చిన విప్లవాత్మక సంస్కరణల గురించి వివరించారు. బీజేపీతో జత కట్టిన టీడీపీ, జనసేన పార్టీలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. అందుకే పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని, అందుకే ప్రజలు కూడా ఆ పార్టీలను పక్కన పెట్టేశారని అన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గడిచిన ఐదేళ్లలో ఏ రాష్ట్రంలోను లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్క కుటుంబానికి అందాయన్నారు.

దీంతో వైఎస్సార్‌సీపీపై ప్రజల్లో విశ్వాసం రెట్టింపైందన్నారు. ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలుస్తానన్న పూర్తి నమ్మకం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్, రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, నాయకులు కె.శ్రీనివాస్, పూర్ణ, రెడ్డి జగన్నాథం, ప్రమీలా, నర్సింహారావు, పాల్‌ఘాట్ కృష్ణ, విరోతి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



70వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న అమర్‌నాథ్

వైఎస్సార్‌సీపీలోకి భారీ చేరికలు

టీడీపీ, జనసేన నుంచి పలువురు మహిళలు, యువకుల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలు, యువకులతో మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్‌సీపీలో చేరికల పరంపర కొనసాగుతూనే ఉంది. 66వ వార్డు కార్పొరేటర్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో జనసేన, టీడీపీలకు చెందిన పలువురు మహిళలు, యువకులు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. చట్టివానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారందరికీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పరిపాలనకు ఆకర్షితులమై తాము వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. గుడివాడ అమర్‌నాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, నాయకులు పల్లా చినతల్లి, ఉరుకూటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయకులు, కార్యకర్తలు

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి...

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలకు చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, నాయకుడు ఇల్లపు ప్రసాద్, వార్డు అధ్యక్షుడు ఏదూరి సోమునాయుడు ఆధ్వర్యంలో మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ మేజర్ సన్స్‌కు పట్టాలిచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. నిర్వాసితులకు మేలు జరగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే మళ్లీ రావాలని ప్రజలతో పాటు ఫార్మాసిటీ నిర్వాసితులు కోరుకుంటున్నారన్నారు. అందుకే పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయన్నారు. రెండో సారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక మెజార్టీతో గాజువాకలో గెలుస్తుందని, ఈ ప్రాంతీయులు ముఖ్యమంత్రి జగన్‌కు మద్దతుగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పూర్ణానంద శర్మ, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, బలిరెడ్డి నాగేశ్వరరావు, ఇల్లపు వాసు, గొలగాని శ్రీను, మామిడి శ్రీను, జెర్రిపోతుల సమర తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం అభ్యర్థి నామినేషన్

గాజువాక : ఇండియా కూటమి నుంచి గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను శనివారం నామినేషన్‌ను దాఖలు చేయనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాకలో ర్యాలీ, సభ నిర్వహించిన అనంతరం నామినేషన్ సమర్పిస్తామన్నారు. కూటమి పార్టీల నాయకులతో పాటు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు ఎస్.పుణ్యవతి తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశంలో 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, నాయకులు పాల్గొన్నారు.

75వ వార్డులో ముమ్మర ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న కొయ్య భారతి

పెదగంట్యాడ: అభివృద్ధి, సంక్షేమ పాలనతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుండి నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఆ పార్టీ 75వ వార్డు నాయకురాలు, మాజీ కౌన్సిలర్ కొయ్య భారతి కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గాజువాక నియోజకవర్గ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలను గెలిపించాలని కోరారు. ఈ మేరకు 75వ వార్డు పరిధిలోని మొల్లివానిపాలెం, అయ్యన్నపాలెం, నెల్లిముక్కు, నీలాపువీధి, ముసలినాయుడుపాలెం, శెట్టిబలిజ వీధుల్లో శుక్రవారం ఆమె ఇంటింటి ప్రచారం చేపట్టారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

కొనసాగుతున్న గంగవరం పోర్టు కార్మికుల ఆందోళన



పోర్టు వంతెన వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు యాజమాన్యంతో నగర పోలీస్‌కమిషనర్ డాక్టర్ రవి శంకర్ జరిపిన చర్చలు విఫలం కావడంతో కార్మికులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గంగవరం పోర్టు గేటు వద్ద చేపట్టిన ఆందోళన కార్యక్రమం శుక్రవారానికి 10వ రోజుకు చేరుకుంది. కార్మికులు తమ కుటుంబాలతో కలసి ఈ ఆందోళనలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా గంగవరం పోర్టు నిర్వాసితుల కమిటీ నాయకులు మాట్లాడుతూ గంగవరం పోర్టు యాజమాన్యం తీరు దారుణంగా ఉందన్నారు. తమకు వేతనాలు పెంచకపోతే వన్ టైం సెటిల్‌మెంట్ చేయాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ స్పందించి వెంటనే యాజమాన్యంతో మరోసారి చర్చలు జరిపి, న్యాయం చేయాలని కోరారు.

కార్పొరేట్లకే బీజేపీ మద్దతు



1163వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రజా సమస్యలను గాలికి వదిలి, కార్పొరేట్లకు మేలు చేకూర్చేందుకే కేంద్రంలోని బీజేపీ నాయకులు ఆసక్తి చూపుతున్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రగతి కోసం ఎంతో కష్టపడిన కార్మికుల జీవితాలను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 1163వ రోజు సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు సంబంధిత సమస్యలను వదిలి.. తమ రాజకీయ అవసరాల కోసం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం స్పందించి, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకుంటున్నట్లు పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకలు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

పెదగంట్యాడ: జీవీఎంసీ జోన్-6 పరిధిలో మరో నలుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. సేవాభావంతో విధులు నిర్వర్తిస్తున్న తమను చంద్రబాబు నాయుడు కుట్రతో సేవలకు దూరం చేశారని మనస్తాపం చెందిన వలంటీర్లు వార్డుల వారీగా తమ రాజీనామాలను సమర్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 76వ వార్డు వుడా ఫేజ్-2లో పని చేస్తున్న జి.రామలక్ష్మి, 65వ వార్డు సంజీవిగిరి కాలనీకి చెందిన పి.అప్పలరెడ్డి, బి.అనిల్‌కుమార్, డి.దేవి రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను ఆయా సచివాలయాల అడ్మిన్లకు అందజేశారని జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు తెలిపారు.

ఉత్సాహంగా ఎన్టీపీసీ గ్రామీణ క్రీడోత్సవం

రసవత్తరంగా సాగిన క్రీడాపోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



రన్నింగ్ లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

అగనంపూడి: క్రీడాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఏటా గ్రామీణ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. ఎన్టీపీసీ సారథ్యంలో పరవాడ మండల స్థాయి క్రీడాపోటీలు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో క్రీడల పట్ల ఆసక్తి ఉంటుందని, క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు మెలగాలన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, జిల్లా పీడీ అండ్ పీఈటీల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎం.నాయుడు, ఎన్టీపీసీ డీజీఎం మహాపాత్రో, సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్ శివప్రతాప్ సింగ్, మేనేజర్ ప్రకాశరావు, న్యాయ నిర్ణేతలు, ఫిజికల్ డైరెక్టర్లు బి.అన్నాజీరావు, ఎస్.వి.రమణ, లోవరాజు, శ్యామ్, రాజు, శ్రీను, అమ్మాజీ, దేవి, శ్యామల, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎండను లెక్క చేయకుండా..

మండుటెండలను సైతం లెక్కచేయకుండా క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. తమ ప్రతిభ చూపారు. బాలురు, బాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందించారు.

ట్రాఫిక్ పటిష్టతకు కొత్త పరికరాలు



బ్రీత్ ఎనలైజర్స్‌ను ప్రారంభిస్తున్న సీపీ రవిశంకర్

బీచ్ రోడ్డు: నగరంలో ట్రాఫిక్‌ను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు భారీ సంఖ్యలో ట్రాఫిక్ నియంత్రణ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చామని సీపీ రవిశంకర్ అయ్యర్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పోలీసు స్టేషన్ల కోసం కొనుగోలు చేసిన బ్రీత్ ఎనలైజర్స్, వీల్ లాక్స్, బాడీ వార్న్ కెమెరాలు, రేడియం జాకెట్స్, బటన్ లైట్లను శుక్రవారం ఆర్కే బీచ్ వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణకు మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ఈ పరికారాలు ఎంతో దోహదపడతాయన్నారు. చాలా మంది యువకులు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని, దీన్ని అరికట్టేందుకు 200 బ్రీత్ ఎనలైజర్స్‌ను కొనుగోలు చేశామన్నారు. రహదారులపై పార్కింగ్ చేసే వాహనాల కోసం 200 వీల్ లాక్స్‌ను కొనుగోలు చేశామన్నారు. వీటితో పాటు పోలీసుల కోసం 200 బాడీ వార్న్ కెమెరాలు, 400 రేడియం జాకెట్స్, 400 బటన్ లైట్లను కొనుగోలు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం అమర్‌ను గెలిపించండి



సమావేశంలో పాల్గొన్న మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

గాజువాక : గాజువాక సమగ్రాభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించాలని ఆయన తల్లి గుడివాడ నాగమణి కోరారు. అమర్‌నాథ్ గెలుపును కాంక్షిస్తూ 72వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రాంతం నుంచి అమర్‌నాథ్ తాత అప్పన్న, తండ్రి గురునాథరావుకు సేవ చేసే అవకాశం కల్పించారని, ఇప్పుడు అదే అవకాశాన్ని అమర్‌నాథ్‌కు కూడా కల్పించాలని కోరారు. అమర్‌నాథ్ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజాన వెంకటరావు, జానకి, వరలక్ష్మి, జగన్, సంతోష్, ఏసుబాబు, రమణమ్మ, సత్యవతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.